# మూడు వర్సిటీలకు కొత్త వీసీలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జూలై 15: రాష్ట్రంలో ఎట్టకేలకు మూడు విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా యూనివర్శిటీకి ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్‌గా ఉన్న ప్రొఫెసర్ ఎస్ సత్యనారాయణను విసిగా నియమించింది. ఉస్మానియా యూనివర్శిటీలో కామర్స్ శాఖాధిపతిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ మహ్మద్ అక్బర్ అలీ ఖాన్‌ను తెలంగాణ యూనివర్శిటీ విసిగా నియమించింది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ అదనపు కార్యదర్శిగా ఉన్న డాక్టర్ ప్రకాష్‌ను బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ విసిగా నియమించారు. త్వరలో ద్రావిడ యూనివర్శిటీ, తెలుగు యూనివర్శిటీ, నాలుగు ▶ మిగతా 7వ పేజీలో

## కొత్త వీసీలు

జెఎన్‌టియు వర్శిటీలు, పాలమూరు వర్శిటీల విసి పదవులు ఖాళీ అవుతున్నాయి. వీటికితోడు ఇప్పటికే ఆదికవి నన్నయ్య, ఆంధ్రాయూనివర్శిటీ, కృష్ణదేవరాయ, పద్మావతి మహిళా యూనివర్శిటీలు ఖాళీగా ఉన్నాయి. వీటికి సైతం రెండ్రోజుల్లో నియామకాలు పూర్తవుతాయని చెబుతున్నారు.

బీడి కార్మికుల సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెండల, హాజరైన బీడి కార్మికులు

# తెలంగాణ వర్శిటీ విసిగా అక్బర్ అలీ ఖాన్

## ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్

డిచ్‌పల్లి రూరల్, జూలై 15: సుదీర్ఘ కాలం నుండి ఇన్‌చార్జిల పాలనలో కొనసాగుతున్న డిచ్‌పల్లి మండలం లోని తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఎట్టకేలకు పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్‌ను నియమించారు. ఉస్మానియా యూనివర్శిటీలో కామర్స్ విభాగం అధిపతిగా కొనసాగుతున్న సీనియర్ ప్రొఫెసర్ మహ్మద్ అక్బర్‌అలీ ఖాన్‌ను ఉపకులపతిగా నియమిస్తూ శుక్రవారం గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ వాస్తవ్యులైన అక్బర్‌అలీ ఖాన్ గడిచిన 30 సంవత్సరాల నుండి ప్రొఫెసర్‌గా కొనసాగుతూ, వందకు పైగా జాతీయ, అంతర్జాతీయ పరిశోధనలకు నేతృత్వం వహించారు. ఇక్కడ వి.సి పోస్టును దక్కించుకునేందుకు అనేక మంది పోటీ పడినప్పటికీ, చివరకు గవర్నర్ సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న అక్బర్‌అలీ ఖాన్ వైపే మొగ్గు చూపారు. ఫుల్‌టైం విసిని నియమించడంతో తెలంగాణ వర్శిటీలో నెలకొన్న సమస్యలకు ఇకనైనా పరిష్కారం లభిస్తుందని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగానే గడిచిన రెండు సంవత్సరాల కాలం నుండి తె.యుకు ఫుల్‌టైం వి.సిని నియమించకుండా ఇన్‌చార్జిలతోనే నెట్టుకొచ్చారు. దీంతో ఎక్కడి సమస్యలక్కడే పేరుకుపోయి విద్యార్థులు, అధ్యాపక బృందం సైతం



మహ్మద్ అక్బర్‌అలీ ఖాన్

ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. 2006వ సంవత్సరంలో నిజామాబాద్ జిల్లాలో తెలంగాణ యూనివర్శిటీని ఏర్పాటు చేయగా, తొలి వైస్‌ఛాన్స్‌లర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన కాశీరాం 2009 నవంబర్ 3వ తేదీన పదవీ విరమణ (మిగతా 3వ పేజీలో)

## నూతన కోర్సులకు ప్రాధాన్యం

### తెలంగాణ వర్సిటీ నూతన విసి అలీఖాన్



అక్బర్ అలీఖాన్‌ను అభినందిస్తున్న ఓయు కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

నాచారం(హైదరాబాద్), జూలై 15: గ్రామీణ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచేలా కొత్త కోర్సులను ప్రారంభించేందుకు ప్రాధాన్యం ఇస్తానని నిజామాబాద్‌లోని తెలంగాణ విశ్వవిద్యాలయం నూతన వైస్ చాన్సలర్‌గా నియమితులైన ప్రొఫెసర్ అక్బర్ అలీఖాన్ తెలిపారు. తనను విసిగా నియమించిన విషయం రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన (మిగతా 8వ పేజీలో)

తీసుకుంటామన్నారు. ఖరీఫ్ సాగుకు

# తెలంగాణ వర్శిటీ విసిగా అక్బర్ అలీ ఖాన్

చేశారు. అప్పటి నుండి కొత్త వి.సిని నియమించకుండా, వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి లింగమూర్తిని ఇన్‌చార్జ్‌గా కొనసాగించారు. ఏడాది కాలానికే ఆయనను పక్కకు తప్పించడంతో, 2010వ సంవత్సరంలో ప్రొఫెసర్ తిరుపతికి తెలంగాణ వర్శిటీ వి.సిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పదవీకాలం పూర్తి కావడంతో 2010 డిసెంబర్ 31వ తేదీన తిరుపతి పదవీ విరమణ చేయగా, 2011 జనవరి 7వ తేదీ నుండి ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో యూనివర్శిటీ బాగోగులు పట్టించుకునే కీలకమైన ఫుల్‌టైం వైస్‌ఛాన్స్‌లర్ లేకపోవడంతో విద్యార్థులు, బోధనా సిబ్బంది సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఓ వైపు నిధుల కేటాయింపుల్లో వివక్ష కనబరుస్తున్న ప్రభుత్వం, వి.సి నియామకం విషయంలోనూ మీనమేషాలు లెక్కిస్తోందంటూ తెలంగాణ వర్శిటీకి చెందిన విద్యార్థి సంఘాలు అనేక సందర్భాల్లో ఆందోళనలు నిర్వహించి తమ నిరసనను వ్యక్తపర్చాయి. వాస్తవానికి 2009 డిసెంబర్ మాసంలోనే సెర్చి కమిటీని నియమిస్తూ తెలంగాణ వర్శిటీకి వి.సిగా పలువురి పేర్లను ప్రతిపాదించినప్పటికీ, రాజకీయ జోక్యం కారణంగా అభ్యంతరాలు తలెత్తడంతో వి.సి నియామకం ప్రక్రియలో ప్రతిష్టంభన నెలకొంది. సెర్చి కమిటీని ఏర్పాటు చేసిన సమయంలోనే తెలంగాణ వర్శిటీ వి.సి బాధ్యతలు చేపట్టేందుకు ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న పిఎల్.విశ్వేశ్వరరావు, రిజిస్ట్రార్ వేణుధర్, జె.తిరుమల్‌రావుతో పాటు తెలంగాణ వర్శిటీకే చెందిన పలువురు ప్రొఫెసర్లు వి.సి పోస్టును ఆశించినట్టు ప్రచారం జరిగింది. వీరిలో సెర్చ్ కమిటీ పిఎల్.విశ్వేశ్వరరావు వైపు మొగ్గు చూపుతూ, గవర్నర్ ఆమోదం నిమిత్తం దస్త్రాన్ని రాజ్‌భవన్‌కు కూడా పంపినట్టు వార్తలు వెలువడ్డాయి. ఇక పిఎల్.విశ్వేశ్వరరావు నియామకం లాంఛనమేనని అప్పట్లో అందరూ భావించారు. అధికార పార్టీకి చెందిన కీలక నేత తోడ్పాటుతో పిఎల్‌వి వి.సి పదవిలో నియమితులు కానున్నారన్న ప్రచారం కొనసాగింది. అయితే ఇదే సమయంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పతాకస్థాయికి చేరి తెరపైకి రావడం, 2009 డిసెంబర్ 9వ తేదీ అనంతర పరిణామాలతో సీమాంధ్రలోనూ ఉద్రిక్తతలు కొనసాగిన దరిమిలా ప్రభుత్వం వి.సి నియామక ప్రకటన వెలువరించడానికి అవరోధం ఏర్పడింది. ఉద్రిక్తతలు దూరమై పరిస్థితులు చక్కబడినప్పటికీ, సెర్చి కమిటీ సూచించిన పేర్లకు గవర్నర్ ఆమోదం లభించకపోవడంతో ఈ ప్రతిపాదనలన్నీ అటకెక్కాయి. ఈ క్రమంలోనే వి.సిల నియామకం బాధ్యతలను గవర్నర్‌కు కట్టబెట్టగా, ఎట్టకేలకు మహ్మద్ అక్బర్‌అలీ ఖాన్‌ను ఉపకులపతిగా నియమిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

## నూతన కోర్సులకు ప్రాధాన్యం

అనంతరం విలేఖరులతో అలీఖాన్ మాట్లాడారు. తెలంగాణ వర్సిటీలో అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులకు తగిన వసతులను కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ విశ్వవిద్యాలయంలో గిరిజన విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున వారికి ఉపాధి కల్పించేలా అడవుల అభివృద్ధి, పాడి పరిశ్రమ తదితర రంగాల్లో కొత్త కోర్సులను ప్రారంభించాల్సి ఉందన్నారు. అన్ని విభాగాల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచేందుకు కృషి చేస్తానన్నారు. కాగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం నుంచి తొలిసారిగా విసి పదవిని దక్కించుకున్న అలీఖాన్‌ను కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ శేఖర్, ప్రొఫెసర్ సులోచన, విద్యార్థి ప్రతినిధులు సత్యనారాయణ, రాజు తదితరులు అభినందనలు తెలిపారు. కామర్స్ విభాగం అధిపతిగా, ప్రిన్సిపాల్‌గా ఎంతో అనుభవం గడించిన అలీఖాన్ సారథ్యంలో తెలంగాణ వర్సిటీ మంచి ఫలితాలను సాధిస్తుందన్న ఆకాంక్షను వీరు వ్యక్తం చేశారు.